క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్



తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిసిన ఢిల్లీ నారాయణ

ఐ.పోలవరం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి పార్టీ కార్యాలయంలో కోనసీమ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ శుక్రవారం కలిశారు. మండలపార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు శ్రీనివాసరాజుతో కలిసి ఆయన జగన్ వద్దకు వెళ్లారు. త్వరలో జరిగే తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా కోరినట్టు ఢిల్లీ నారాయణ స్థానిక విలేకరులకు వివరించారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: నిరుద్యోగ యువత, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళలు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు చెందిన వారు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, డివిజన్ డెవలప్మెంట్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర పరిశ్రమల కేంద్రం ఉన్నతాధికారులు, గనులు, భూగర్భ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, శశిభూషణ్ కుమార్‌లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలు, వ్యాపారాల స్థాపనతో నిరుద్యోగాన్ని పరిష్కరించే వ్యూహాత్మక విధానాన్ని ఎంఎస్ఎంఈలు ప్రతిబింబిస్తాయన్నారు. జిల్లాల్లో ఉచిత ఇసుకను డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ అనుమతులతో కూడిన ఇసుకను వినియోగించు కొనేలా చర్యలు చేపట్టాలన్నారు.ఈ నెల 19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని నిర్వహించాలని గ్రామీణాభివృద్ధి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి ఎల్.వంశీధర్ రెడ్డి, కొత్తపేట ఆర్డీఓ పి శ్రీకర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, డీఎల్‌డీఓ త్రినాథ్, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ టీ.సుజాత, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ సువిజయ్ పాల్గొన్నారు.

సోమనాథేశ్వర జ్యోతిర్లింగ రథయాత్ర

అమలాపురం టౌన్: అనంతపురం జిల్లా హిందూపురంలో కార్తికమాసం సందర్భంగా ఈనెల 6న మొదలైన సోమనాథేశ్వర జ్యోతిర్లింగ స్వర్ణిమ రథయాత్ర కోనసీమకు నాలుగు రోజుల కిందట వచ్చింది. ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సాగుతున్న ఈ రథయాత్రకు తొలుత అమలాపురం ఓంశాంతి కేంద్రం ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీలు, బ్రహ్మకుమారులు స్వాగతం పలికారు. గత నాలుగు రోజుల నుంచి రథం అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లోని పలు గ్రామాల మీదుగా సాగుతోంది. గురు, శుక్రవారాల్లో రథం అమలాపురం పట్టణం, రూరల్ మండలంతో పాటు అంబాజీపేట మండలం తొండవరం, వారలగరువు గ్రామాల మీదుగా కొర్లపాటి వారపాలెం, మాచవరం, పి.గన్నవరం మండలం ముంగండ గ్రామాల్లో సాగింది. మహిళా భక్తులు ఎదురేగి రథానికి పూజలు చేస్తున్నారు.

నోటీసులు తిరస్కరించడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తాళ్లరేవు: మండల పరిధిలోని చినగోవలంక గ్రామ పంచాయతీలో అన్యాక్రాంతం అయిన స్థలానికి సంబంధించి అధికారులు ఇచ్చిన నోటీసులను ఆక్రమణదారులు తిరస్కరించడంపై గ్రామ సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ శుక్రవారం జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీకి చెందిన సర్వే నెంబరు 52–4లో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనట్లు గతంలో పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ చేసి స్థలం ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించి స్థలాన్ని ఖాళీ చేయాలని సూచిస్తూ ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వగా వెనక్కి పంపివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

గ్రామసభలకు ప్రాధాన్యమివ్వాలి

ఉప్పలగుప్తం: గ్రామ సభలకు ప్రాముఖ్యత ఇవ్వాలని డీజీపీవో డి.శాంతలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై ఆయా శాఖల అధికారులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలకు వచ్చే నిధులు ఎలా వినియోగించాలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ భీమేశ్వరి, ఎంపీడీవో రాజకుమార్, ఏవో మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు భద్రత కరవు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా శాసనసభ్యులకు రక్షణ లేకుండా పోయిందని శాంతిభద్రతలు అదుపు తప్పాయని పార్లమెంట్ సభ్యుడు వి వైథిలింగం ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇండిపెండెంట్ ఎమ్మెల్యే శివశంకర్‌కు రౌడీల నుంచి బెదిరింపులు రావడం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం నారాయణ సామి మాట్లాడుతూ ఇండిపెండెంట్ ఎమ్మెల్యేకు బెదిరింపులు వస్తున్నాయని పోలీసులు స్పందించి తక్షణం యాంటీ గూండాయాక్ట్ ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు.

సురక్షిత ప్రయాణానికి రైట్..రైట్

- నాణ్యమైన సేవలు అందించే దిశగా ఆర్టీసీ ముందడుగు
- బస్సుల కండిషన్ మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి
- సంతోషకర వారోత్సవాలతో సత్ఫలితాలు
- 'డ్రైవర్ హ్యాపీనెస్ వీక్ రిజిస్టర్' తో సమస్యల గుర్తింపు
- సిబ్బందితో మమేకమవుతున్న అధికారులు



డ్రైవర్ల సమస్యలు తెలుసుకుంటున్న డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి

అమలాపురం రూరల్: కండిషన్ లేని డొక్కు బస్సులు..ఎక్కడ ఆగిపోతాయో తెలియని అయోమయంలో ప్రయాణికులు..ఆర్టీసీ బస్సు ఎక్కితే సకాలంలో గమ్యస్థానాలకు చేరలేమనే భయంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించే పరిస్థితి.. ఇదీ కొన్నేళ్ల క్రితం వరకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ఆర్టీసీ)పై సగటు ప్రయాణికుడిలో ఉన్న అపనమ్మకం. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంస్థ అభివృద్ధికి నూతన విధానాలను అవలంబించడంతో ఆర్టీసీ అభివృద్ధి బాటలో పరుగులు పెడుతోంది. గమ్యస్థానాన్ని సురక్షితంగా చేరాలంటే యాంత్రిక లోపాలు లేని నాణ్యమైన బస్సులు అవసరమని అధికారులు గుర్తించారు. ప్రయాణికులలో నమ్మకం కలగాలన్నా, ఆర్టీసీ ఆదాయం పెరగాలన్నా కండిషన్‌లో ఉన్న నాణ్యమైన బస్సులు అందుబాటులో ఉంటేనే సాధ్యమని ఆ దిశగా దృష్టి సారించారు. ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం దీనిపై ఆలోచన చేసింది. దీనిలో భాగంగా అమలాపురం ఆర్టీసీ డిపోలో ప్రతి నెల ఒకటవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

డిపోలో ఉన్న అన్ని బస్సులు సర్వీసు పూర్తి చేసుకుని గ్యారేజ్‌లో ఇన్‌కమింగ్ అయిన తర్వాత డ్రైవర్‌తో డిపోమేనేజర్ కమిటీ చర్చించి బస్సుల్లో ఉన్న లోపాలను అడిగి తెలుసుకుంటారు. ఈ క్రమంలో 'డ్రైవర్ హ్యాపీనెస్ వీక్ రిజిస్టర్'లో పొందుపరచిన లోపాలను త్వరిత గతిన గ్యారేజ్‌లోని మెకానిక్స్, ఎలక్ట్రీషియన్స్, కోచ్ బిల్డర్లతో సరి చేయిస్తున్నట్లుగా డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. అమలాపురం డిపోలో అమరావతి, నైట్ రైడర్, ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, పల్లె వెలుగు కేటగిరీలలో మొత్తం 145 బస్సులు ఉన్నాయి. సుమారు 300 మంది డ్రైవర్లు ప్రతిరోజు విధులు నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల క్షేమం కోసం విధి నిర్వహణలో డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడిపితే చాలదు. ఆ బస్సులు పూర్తిస్థాయి కండిషన్‌లో ఉండాల్సిన అవసరం ఉంది. డ్రైవర్ ఏకాగ్రత తప్పితే జరిగే నష్టం ప్రయాణికులకే అనే విషయం అందరికీ తెలిసిందే. 'గ్యారేజి సిబ్బందికి డ్రైవరే ప్రధాన వినియోగదారుడు' అనే నినాదంతో ప్రతి నెల మొదటి వారం రోజులు డ్రైవర్లు తెలిపిన లోపాలను సరిచేసి, సరిచేసిన లోపాలను డ్రైవర్‌కి నమ్మకం కలిగే విధంగా నోటీసు బోర్డు ద్వారా తెలియజేస్తున్నారు.

పీరియాడికల్ మెయింటెనెన్స్‌తో సత్ఫలితాలు

విధి నిర్వహణలో డ్రైవర్లు పూర్తి ఏకాగ్రతతో ఉండాలంటే మెరుగైన బస్సులు అందించాలనే యోచనతో గ్యారెజ్‌లో పీరియాడికల్ మెయింటెనెన్స్‌కు సంబంధించి చర్యలు తీసుకొంటున్నారు. దీనికి కావాల్సిన విడి భాగాలు, ఫిల్టర్లు, బేరింగులు తదితర స్పేర్ పార్టులు ముందుగానే మెటీరియల్ రిక్వైర్‌మెంట్ ప్లానర్ (ఎంఆర్‌పీ) ద్వారా సమకూర్చుకుని జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో సమర్థవంతమైన మెయింటెనెన్స్ చేస్తున్నారు. ప్రతిరోజూ బస్సు యొక్క నాణ్యత తెలుసుకోవడానికి గ్యారేజ్ సూపర్ వైజర్లు, మెయింటెనెన్స్ సిబ్బందితో ఆన్‌రోడ్డు పరీక్షలు చేస్తున్నారు. సుమారు 20 కిలోమీటర్ల ట్రయల్ వెళ్ళి బస్సు కండిషన్ పూర్తిగా నిర్ధారించుకొన్న తర్వాతనే బస్సును సర్వీసుకు ఇస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు.రాజమహేంద్రవరం డిప్యూటీ సీఎంఈ జోన్–2 ఎస్.కే.రవిశంకర్ డిపోలను సందర్శించి మెరుగైన బస్సులను అందించటంలో కావలసిన తోడ్పాటును డిపోలకు అందిస్తున్నారు.

బస్సుల ఫిట్‌నెస్ పెరుగుతుంది



గతంలో బస్సుల్లో సాంకేతిక లోపాల కారణంగా ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఒక్కోసారి బస్సులు అకస్మాత్తుగా ఆగిపోయేవి. బస్సుల్లోని యాంత్రిక పరమైన లోపాలను నేరుగా డిపో మేనేజర్ అడిగి తెలుసుకొని నివారణ చర్యలు తీసుకోవటం వల్ల బస్సుల ఫిట్‌నెస్ పెరుగుతుంది. సకాలంలో బస్సులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు దోహదపడుతుంది.

– జి. ఈశ్వరరావు, డ్రైవర్, అమలాపురం

మెరుగైన సేవలు



బస్సును కండిషన్‌తో ఇవ్వడం వల్ల ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుంది. సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోవడం వల్ల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ డిపో ఆదాయం పెరిగే దిశగా చిత్తశుద్ధితో సేవలందిస్తున్నాం.

– జీవీ వెంకటరమణ, డ్రైవర్, అమలాపురం

యాంత్రిక లోపాల గుర్తింపుపై దృష్టి



బస్సులు సకాలంలో సురక్షితంగా గమ్యస్థానం చేరాలంటే యాంత్రిక లోపాలు సరిచేయాలి. ప్రయాణికులకు నమ్మకం కలగాలన్నా, ఆర్టీసీ ఆదాయం పెరగాలన్నా కండిషన్‌తో ఉన్న నాణ్యమైన బస్సులు ఎంతైనా అవసరం. బస్సుల్లోని చిన్నపాటి లోపాలను అడిగి తెలుసుకుని నేరుగా 'డ్రైవర్ హ్యాపీనెస్ వీక్ రిజిస్టర్'లో పొందుపరుస్తున్నాం. ప్రతిరోజూ మెయింటెనెన్స్ అయిన బస్సు యొక్క నాణ్యత తెలుసుకోవడానికి గ్యారేజీ సూపర్ వైజర్లు మెయింటెనెన్స్ సిబ్బందితో ఆన్‌రోడ్డు టెస్టు చేస్తున్నారు. బస్సు కండిషన్ పూర్తిగా నిర్ధారించుకొన్న తర్వాతనే బస్సులు సర్వీసుకు ఇవ్వడం జరుగుతుంది.

– చల్లా సత్యనారాయణమూర్తి, డిపో మేనేజర్, అమలాపురం

పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలు

మున్సిపల్ కమిషనర్ రాజు



సమనసలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయాల్లో లభ్యమయ్యే విజ్ఞాన గ్రంథాలను ఆకళింపు చేసుకోవాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకట రాజరాజేశ్వరరాజు సూచించారు. అమలాపురంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలకు రెండోరోజు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను కమిషనర్ రాజు ప్రారంభించారు. గ్రంథాలయ పాఠకులతో మమేకమై పుస్తక పఠనం విశిష్టతను వివరించారు. గ్రంథాలయాధికారి వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలను వక్తలు వివరించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పుస్తక ప్రదర్శనలో పాల్గొని పలు పుస్తకాలను పఠనం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, ఆకుల భవాని, పాఠకులు కె.తులసీ రామాకాంత్, షేక్ ముత్యాజ, పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం మండలం సవరప్పాలెం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సమనస బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వైటీవీ రాజు, ఉపాధ్యాయులు గ్రంథాలయాల విశిష్టత గురించి వివరించారు. విద్యార్థులకు పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందని వివరించారు, గ్రంథాలయాధికారి ఎస్‌వి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వారోత్సవాలలో భాగంగా ముమ్మిడివరం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంథ్రాలయానికి వచ్చిన విద్యార్థులు, పాఠకులు తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని కొద్దిసేపు పఠనం చేశారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు గ్రంథాలయాధికారి శీలం నాగరాజు వివరించారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

అమలాపురం టౌన్: మాదక ద్రవ్యాల విషయంలో విద్యార్థులు అవగాహనతో ఉండాలని అమలాపురం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ సూచించారు. స్థానిక మిరియాం డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో శుక్రవారం జరిగిన డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డ్రగ్స్ రహిత సమాజ ఆవిష్కరణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సీఐ సత్యనారాయణ పిలుపునిచ్చారు. అమలాపురం ఎక్సైజ్ ఎస్సై బాలాజీ మాట్లాడుతూ డ్రగ్స్ వాడడం వల్ల ఆరోగ్యపరంగా ఎదురయ్యే ఇబ్బందులు, చట్టపరంగా నమోదయ్యే కేసుల తీవ్రత గురించి వివరించారు. అమలాపురం రూరల్ మండలం ఏ.వేమవరం పంచాయతీ సిబ్బందికి డ్రగ్స్ నియంత్రణపై ఎస్సై బాలాజీ అవగాహన కల్పించారు.

మాదిగల ఆత్మీయసభ విజయవంతానికి పిలుపు


అమలాపురం టౌన్: రాజమహేంద్రవరంలో ఈనెల 21న జరగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళన మహాసభకు మాదిగ ఉద్యోగులు విధిగా హాజరై విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు పిలుపునిచ్చారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎమ్‌ఈఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎత్తు రోడ్డులో శుక్రవారం జరిగిన మాదిగ ఉద్యోగుల కారవర్గ సమావేశంలో శ్రీరాములు మాట్లాడారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మడికి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సన్నాహక సమావేశంలో శ్రీరాములు మాట్లాడుతూ మాదిగల రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆత్మీయ సమ్మేళన మహాసభకు మాదిగ ఉద్యోగులే కాక జిల్లాలోని ప్రతి మాదిగ సోదరుడు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి తెన్నేటి రాజబాబు, జిల్లా ఎమ్‌ఈఎఫ్ అధ్యక్షుడు మట్టా నాగేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధులు కొరుకూరి కృపావరం, నవుండ్రు వాడపల్లి, నవరపు నానిబాబు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి

డీపీవో శాంతలక్ష్మి

అమలాపురం రూరల్: 2025–2026 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీలు గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని డీపీవో ఈ.శాంతలక్ష్మి గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. అమలాపురం మండంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాభివృద్ధి ప్రణాళిలు ఏవిధంగా తయారు చేయాలో టీటీటీలు బి.అనంత సుబ్బలక్ష్మి, పడుచూరి సూరిబాబులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాబ్జిరాజు, ఈవోపీఆర్డీ బి.మంగాదేవి, జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు సూరపరాజు, కార్యదర్శులు శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగంపై కేసు నమోదు చేయాలి



కోపరేటివ్ బ్యాంక్‌కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందజేస్తున్న యశ్వంతయ్య

యానాం: యానాం కోపరేటివ్ స్టోర్స్‌లో లిక్కర్ విక్రయాలకు సంబంధించి రూ.83లక్షల మేర ప్రజాధనం పక్కదోవ పట్టిన ఘటనపై సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయాలని యానాం కోపరేటివ్ సొసైటీ సభ్యులు పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీస్ యశ్వంతయ్యకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పుదుచ్చేరి నుంచి వచ్చిన యశ్వంతయ్య కోపరేటివ్ స్టోర్స్‌ను తనిఖీ చేసి డైరెక్టర్‌ల బోర్డు సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ధూళిపూడి మధు మాట్లాడుతూ 2018 నుంచి 2021 వరకు కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచిన లిక్కర్ అవుట్‌లెట్స్ ద్వారా జరిగిన అమ్మకాల్లో లక్షలాది రూపాయల మేర అవినీతి జరిగిందని దీనిని విచారణ చేసిన కోపరేటివ్ అధికారులు పక్కదోవ పట్టిన విషయం నిజమేనని ధృవీకరించినట్లు తెలిపారు. అయినప్పటికి సంబంధితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని యశ్వంతయ్య దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పుదుచ్చేరి కోపరేటివ్ బ్యాంకు, యానాం శాఖను యశ్వంతయ్య సందర్శించారు. అనంతరం బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డును బ్యాంకు ఏజీఎం సూర్యనారాయణ(సూరిబాబు)కు అందజేశారు. అధికారులు సారంగపాణి, కుమరన్, ఆచార్యులు, రజాక్, ముమ్మిడి శంకర్ పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా బ్యాంకింగ్ సేవలు



మాట్లాడుతున్న జిల్లా సహకార స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ మురళీకృష్ణ

ముమ్మిడివరం: సొసైటీల కంప్యూటరీకరణ పూర్తి అయితే బ్యాంకింగ్ రంగం మాదిరిగానే సహకార సంఘాలు కూడా ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తాయని జిల్లా సహకార స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. ముమ్మిడివరం ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయంలో శుక్రవారం అఖిల భారత సహకార వారోత్సవాలు జరిగాయి. సహకార సంఘంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన అనే అంశంపై సమావేశం జరిగింది. డివిజనల్ సహకార సంఘం అధికారి రాధాకృష్ణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడుతూ కంప్యూటరీకరణ వలన సంఘాలు పారదర్శకంగా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో వి.వెంకటనారాయణ, రైతుసేవా కేంద్రం ఏఈవో కృష్ణయ్య, సొసైటీ సీఈవో మట్టపర్తి జయరాంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీకి దరఖాస్తు చేసుకోవాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో ఉప్పునీటి రొయ్యల సాగు చేస్తున్న రైతాంగం 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఇన్‌పుట్ సబ్సిడీకి దరఖాస్తు చేసుకోవాలని మత్స్యశాఖ ఏడీ డి గొంతియ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా ఒక ఎకరానికి రూ.10వేలు చొప్పున 3 ఎకరాల వరకు ఇన్‌పుట్ సబ్సీడీ అందిస్తారన్నారు. కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ(సీఏఏ) నందు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి మాత్రమే పుదుచ్చేరి ప్రభుత్వం ఈ ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తుందన్నారు. రైతులు మత్స్యశాఖ ద్వారా దరఖాస్తులు పొంది వచ్చే నెల 15లోగా వాటిని అందించాలని కోరారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం

తాళ్లరేవు: పవిత్ర కార్తిక పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మకి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి చిన్న నేతృత్వంలో కాట్నం సత్తిబాబు, వెంకటరమణ, కాశీరాజు, సురేష్, పద్దరాజు సోదరులచే పాలాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విళ్ల సత్యన్నారాయణ, విళ్ల వీర, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, పితాని వీరబాబు, ధూళిపూడి గొల్లబాబు, ధూళిపూడి సుభ, నాగు, గంగావతి పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన సర్పంచ్‌లు



డీఎస్పీ ప్రసాద్‌ను కలిసిన పలువురు గ్రామ సర్పంచ్‌లు

అమలాపురం టౌన్: డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను అమలాపురం రూరల్ మండలంలోని పలువురు గ్రామ సర్పంచ్‌లు తన కార్యాలయంలో శుక్రవారం కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రం అందించారు. గ్రామాల్లో సర్పంచులే ప్రథమ పౌరులని గుర్తు చేశారు. గ్రామాల్లో ఎటువంటి ఘటనలు చోటు చేసుకున్నా తొలుత సర్పంచుల దృష్టికి తీసుకురావాలని అభ్యర్థించారు. సర్పంచ్‌లు కరాటం ప్రసన్న ప్రవీణ్, పెనుమాల సునీత, గంగుమళ్ల ఏసుబాబు, పందిరి విజయక్రీస్తు, గుత్తుల చిరంజీవి, పెద్దిరెడ్డి రాము, మట్టా రామారావు, పందిరి శ్రీను తదితరులు డీఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

రేపు గౌడ సంఘీయుల కార్తిక వనసమారాధన

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న పట్టణంలోని శ్రీరామపురం శివారులో గౌడ కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు పట్టణ సంఘం అధ్యక్షుడు మట్ట రవికిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కోనసీమ వ్యాప్తంగా ఉన్న గౌడ కుటుంబీకులు తరలి రావాలని సంఘం కార్యదర్శి దాసరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

ముమ్మిడివరం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భార్య తిరిగి రాలేదని భర్త ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి తొమ్మిదవ వార్డుకు చెందిన ఉందుర్తి సుబ్బారావు భార్య శ్రీవాణి బంధువులను తీసుకువచ్చేందుకు ఇంటి నుంచి బస్టాండ్‌కు వెళ్లింది. తరువాత నుంచి కనిపించకుండా పోయింది. ఆమె ఆచూకీ కోసం బంధువులు గాలించినప్పటికీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో పలువురు దాతల ఆధ్వర్యంలో 400 మంది అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. సుంకరపాలెం, యానాం, తాళ్లరేవు ప్రాంతాలతో పాటు ఐ.పోలవరం మండలం నుంచి అయ్యప్ప స్వాములు హాజరై భిక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా దాతలను గురుస్వాములు ఘనంగా సత్కరించారు. పెద్దిరెడ్డి ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో ఆకుల బుజ్జి ఆధ్వర్యంలో అంబాజీపేట లీజర్ రైట్ కంటి ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు.గ్రామ సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి శిబిరాన్ని ప్రారంభించగా వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆకుల రాము, నాగిరెడ్డి రాంబాబు, సుందరనీడి ఏసుబాబు, దివి కృష్ణ, బసవా ప్రకాష్, సుందరనీడి రాజబాబు, మారిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

దీప కాంతులతో శోభిల్లిన శైవక్షేత్రాలు



విలసవిల్లిలో లక్ష దీపారాధన



అమలాపురం చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బుద్ధుని విగ్రహానికి పూజలు చేస్తున్న బుద్ధవిహార్ కమిటీ సభ్యులు

అమలాపురం టౌన్: కార్తిక పౌర్ణమి సందర్భంగా అమలాపురం పట్టణంలోని శివాలయాల వద్ద శుక్రవారం రాత్రి జ్వాలా తోరణాలు వెలిగించడంతో ఆయా ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శివాలయాల వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి ఆలయాలను తేజోమయం చేశారు. పట్టణంలోని పురాతన శివక్షేత్రం చెన్న మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తిక దీపాలు వెలిగించారు. పౌర్ణమి పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్వాలా తోరణాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ మాచిరాజు రవి కుమార్, నాగవల్లి దంపతులు జ్వలింపజేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు 365 వొత్తులతో దీపాలు వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక బుద్ధ పౌర్ణమి

అమలాపురం రూరల్: అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో శుక్రవారం కార్తిక బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి, బుద్ధ విహార్ చైర్మన్ గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ కార్తిక బుద్ధ పౌర్ణమి రోజున గౌతమ బుద్ధుడు ప్రపంచం నలు మూలలకు బౌద్ధ ధర్మ వ్యాప్తి కోసం బౌద్ధ భిక్షువులను పంపించారన్నారు. సెక్రటరీ జనరల్ డీబీ లోక్, కోనసీమ జిల్లా బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు కాశి పరుశురాం బోధి, జిల్లా ప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ తదితరులు బుద్ధుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈవీవీ సత్యనారాయణ, కాశి వెంకట్రావు, గోసంగి ఆనందరావు, కోడూరి రామమూర్తి, జల్లి శ్రీనివాసరావు, జె రంగారావు, బొంతు రమణ, జి వెంకటేష్, నాతి శ్రీనివాసరావు, యు.సత్యనారాయణ, కె వెంకట బాబ్జి, రామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ఆధ్యాత్మిక శోభ నెలకొంది. తెల్లవారు జాము నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. పవిత్ర వృద్ధగౌతమి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు కార్తిక దామోదరుడిని ఆరాధిస్తూ ఆలయంలో దీపాలు వెలిగించారు. సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా చండీహోమం

కార్తిక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని మురమళ్ళ శ్రీ వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత గణపతి పూజ, మండపారాధన అనంతరం చండీ హోమం, పూర్ణాహుతి జరిపారు.

కామాక్షీ పీఠంలో రాహుకాల దీపాలు

అమలాపురం టౌన్: కార్తిక పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ కామాక్షీ పీఠంలో వందలాది మహిళలు రాహుకాల దీపాలను శుక్రవారం వెలిగించి పీఠాన్ని కాంతిమయం చేశారు. ఉదయమే మహిళలు అధిక సంఖ్యలో పీఠానికి చేరుకుని పౌర్ణమి పూజలు చేశారు. రాహుకాల దీపాలు వెలిగించి పూజలు చేశారు. పీఠాధిపతి కామేశ మహర్షి మహిళలకు కార్తిక ఆశీస్సులు అందించారు.

ఉప్పలగుప్తం: పవిత్ర కార్తిక పౌర్ణమి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరారు. మండలంలోని గొల్లవిల్లి, సన్నవిల్లి, భీమనపల్లి, ఎస్.కొత్తపల్లి, చల్లపల్లి, ఉప్పలగుప్తం, మునిపల్లి గ్రామాల్లో ఉన్న శివాలయాల వద్ద భక్తులు జ్వాలాతోరణం వెలిగించి గ్రామోత్సవాలు నిర్వహించారు. విలసవిల్లి శ్రీరామ మందిరం లో లక్ష దీపారాధన నిర్వహించి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు.

ఐ.పోలవరం: కార్తిక పౌర్ణమి సందర్భంగా మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్వాలా తోరణం నిర్వహించారు. తొలుత శులాల సంబరంతో స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. వేద పండితులు స్వామివారి పల్లకీని మోశారు. అనంతరం జ్వాలా తోరణాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

తాళ్లరేవు: పవిత్ర కార్తిక పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారు జామునుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు పోటెత్తారు. పరమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయాల వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేశారు.